ప్రజాశక్తి
శుక్రవారం 27 జూన్ 2025 5 విజయనగరం



కేంద్రీయ విద్యాలయంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ విద్యాలయంలో తరగతి 3, 11, 12తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 26 నుంచి 30వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు కోసం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యాలయంలో సంప్రదించవచ్చని లేదా అప్లికేషన్స్ విద్యాలయ వెబ్సైటు https://vizianagaram.kvs.ac.in లో డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

వెలుగులో చీకటి బదిలీలు

- ఇష్టారాజ్యంగా పోస్టుల సర్దుబాటు
- మిగులు పోస్టుల పేరుతో సుదూర ప్రాంతాలకు స్థాన చలనం
- ఐదేళ్లు నిండినవారి స్థానాలు పదిలం
- మూడేళ్లు నిండని మహిళా డిపిఎంకు 750 కిలోమీటర్ల దూరం బదిలీ
- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- పెచ్చుమీరిన రాజకీయ జోక్యమే కారణమా?
- పాతికేళ్ల సెర్ప్ చరిత్రలోనే దారుణమైన దుస్థితి

డ్వాక్రా గ్రూపులు అంటే టక్కున గుర్తు వచ్చేది టిడిపి ప్రభుత్వం. ఈ విషయంలో సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోడీనే ఒకానొక సందర్భంలో చంద్రబాబును ప్రశంసించారు. మహిళా సంఘాల నడకలో సిసి, ఎపిఎం, డిపిఎం వంటి (డిఆర్‌డిఎ - వెలుగు) సిబ్బంది వెన్నుముక వంటి వారు అనడంలో సందేహం లేదు. పొదుపు మహిళల సమావేశాలు, తీర్మానాలు మొదలుకుని, రూ.కోట్ల రుణాల మంజూరు, వ్యాపార కార్యకలాపాలన్నీ వారి కనుసన్నల్లోనే సాగుతుంటాయి. బహుశా అందుకేనేమో వీరిని బదిలీ చేయాలంటే ఏ ప్రభుత్వమైనా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తూ వచ్చాయి. కానీ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్)లో అంతర భాగంగావున్న 'డిఆర్‌డిఎ - వెలుగు'లో ఈసారి బదిలీలు అందుకు భిన్నంగా జరిగాయి. ముచ్చటగా మూడేళ్లు కూడా పనిచేయని వారిని వందల కిలోమీటర్ల దూరంలోకి విసిరేశారు. ఐదేళ్లకు పైగా ఇక్కడే పని చేసిన వారిని అక్కున చేర్చుకున్నారు. 'సర్దుబాట్లు అనేవి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన' అన్న పేరే తప్ప ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరించారు. జోనల్ పరిధిలోని బదిలీ చేయాల్సిన ఎపిఎంలను ఇతర జోన్ల పరిధిలోకి నెట్టేశారు. కౌన్సిలింగ్‌ను బహిష్కరించిన వారిని కదపనేలేదు. కౌన్సిలింగ్‌కు హాజరైన వారిని ఇతర జిల్లాలకు గెంటేశారు. ఇది మన (విజయనగరం) జిల్లాలో... కాదు కాదు సెర్ప్ చరిత్రలోనే మునుపెన్నడు లేనంత బదిలీ(ల)లు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లు నిండిన వారికి బదిలీలు చేపట్టిన సంగతి విధితమే. మూడేళ్లు నిండిన వారికి రిక్వెస్ట్ పెట్టుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 102 మంది ఎపిఎంలను కౌన్సిలింగ్ కు హాజరు కావలసిందిగా ఉన్నతాధికారులు పిలిచారు. వీరిలో కేవలం 30 మంది మాత్రమే కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. 72 మంది బహిష్కరించారు. వీరిలోనూ 16 మంది ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన వారు కావడం విశేషం. ఇందులో 11 మందికి కాకినాడ, అనకాపల్లి, రాజమండ్రి తదితర జిల్లాలకు బదిలీ చేశారు. మిగిలిన ఐదుగుర్ని స్థానికంగానే ఉంచేశారు. నిబంధనల ప్రకారం ఎపిఎంలను విశాఖ జోన్ పరిధిలోని బదిలీ చేయాల్సి ఉంది. కానీ, కాకినాడ, రాజమండ్రి, కోనసీమ జిల్లాలకు బదిలీ చేసేశారు. వీరిని ఏ ప్రాతిపదికన స్థానికంగా ఉంచారో? తమను జోన్ పరిధి కూడా ఎందుకు దాటించేశారో అర్థం కావడం లేదని పలువురు ఎపిఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను జిల్లాకు చెందిన మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు.

మూడేళ్ల సర్వీసు నిండని మహిళకి 750కిలో మీటర్ల దూరం బదిలీ

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 11 మంది డిపిఎంలు ఉన్నారు. వీరిలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు 8మంది, మూడేళ్ల పనిచేసినవారు ముగ్గురు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో చొరో 5పోస్టులు చొప్పున మొత్తం 10మాత్రమే ఉన్నాయనేది అధికారం యంత్రాంగం వాదన. ఈ లెక్కన ఐదేళ్ల సర్వీస్ దాటిన వారిలో ఒక్కర్ని బదిలీ చేస్తే సరిపోయేది. కానీ, 2 సంవత్సరాల 10 నెలల సర్వీస్ కలిగిన లెంక రాజ్యలక్ష్మిని సుమారు 750 కిలోమీటర్ల దూరంలో గల నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. ఇదేమంటే, రాష్ట్రవ్యాప్తంగా మిగులు పోస్టులను సర్దుబాటు చేస్తున్నామని, స్థానికంగా ఒక పోస్టు అదనంగా ఉండడం వల్ల ఒకరిని బదిలీ చేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అదే నిజమైతే తనకన్నా ముందు నుంచి (సుమారు 5 ఏళ్లకు పైగా) పని చేసిన వారిని ఇక్కడే ఉంచి, తనను మాత్రమే ఎందుకు బదిలీ చేశారని రాజ్యలక్ష్మి ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు ఒక మహిళా ఉద్యోగిని వందల కిలోమీటర్ల దూరం బదిలీ చేయడం వెనుక రాజకీయ కక్ష సాధింపులు కూడా ఉన్నాయని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా ఏకంగా బదిలీ చేయడం ఎంత వరకు సమంజసమని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కౌన్సిలింగ్ బహిష్కరించిన వారి స్థానాలు పదిలం

బహుశా అప్పటికే రాజకీయ పైరవీలు పెచ్చు మీరాయని, నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేసే అవకాశం ఉందని భావించారేమో. రాష్ట్రవ్యాప్తంగా 102 మంది ఎపిఎంలకు కౌన్సిలింగ్ కోసం సమాచారం ఇవ్వగా, 72 మంది కౌన్సిలింగ్ ను బహిష్కరించారు. అయినప్పటికీ వీరంతా యధా తధ స్థానాల్లోనే కొనసాగుతున్నారు. పోని కౌన్సిలింగ్‌కు హాజరైనవారంతా బదిలీ అయ్యారా? అంటే అదీ లేదు. విభజిత విజయనగరం నుంచి హాజరైన ఆరుగురు యథాతథ స్థానాల్లో ఉండిపోవడం గమనార్హం. దీన్నిబట్టి రాజకీయ పైరవీలు, కక్ష సాధింపులు జరిగాయన్న విమర్శలు ఊపందుకున్నాయి.

మంత్రి జోక్యం ఉన్నట్టా? లేనట్టా?

వెలుగు సిబ్బంది బదిలీల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు జోక్యం ఉన్నట్టా? లేనట్టా? అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. జోక్యం ఉంటే నిబంధనల అతిక్రమణ ఎలా జరిగింది? లేదంటే ఎందుకు జోక్యం చేసుకోలేదు అన్న ప్రశ్నలకు కూడా తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. శ్రీనివాసరావు జిల్లాకు చెందిన మంత్రి మాత్రమే కాదు. సాక్షాత్తు డిఆర్‌డిఎ కూడా ఆయన పరిధిలోని శాఖ. ఈనేపథ్యంలో ఆయన సొంత జిల్లాలో సొంత శాఖలోనే ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కావడం పట్ల ఉద్యోగులంతా విస్తుపోతున్నారు. ఆయన పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ వేగవంతం

వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులకు సూచించారు. రెవిన్యూ వినతులన్నిటినీ డిస్పోజ్ చేయడం ముఖ్యం కాదని వాటికీ నాణ్యమైన పరిష్కారం లభించేలా చూడాలని ఆదేశించారు. ప్రతి సోమవారం కలక్టరేట్ కు వచ్చే వినతుల్లో 90 శాతం వరకు రెవిన్యూ కు సంబందినవేనని అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియం లో రెవిన్యూ అధికారులతో కలెక్టర్ అంబేద్కర్ , జెసి సేతు మాధవన్ ఇళ్ళ స్థలాల క్రమ బద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్, నీటి తీరువా , ఆన్లైన్ సర్వీసెస్ పెండింగ్ , పిజిఆర్ఎస్ వినతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థలాల క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. ఆక్రమిత దారులతో దరఖాస్తులు పెట్టించాలని, అందు కోసం విఆర్ఒ లు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ సందర్శించాలని తెలిపారు. జీవో 30 కింద 260 దరఖాస్తులు తహశీల్దార్ల లాగిన్ లో ఉన్నాయని, వాటిని పరిశీలించి వచ్చేవారం నాటికి జెసి లాగిన్ లోకి పంపాలని తెలిపారు. అందరికీ గృహాలు పథకం కింద జిల్లాలో 6 వేల దరఖాస్తులు అందాయని, వీటిని వెరిఫై చేసి వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సర్వేయర్లు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, వారికి వెంటనే మెమోలు జారీచేసి జీతాలు నిలుపుదల చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడికి కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, , ఆర్‌డిఒలు సవరమ్మ, రామ్మోహన్, ఆశయ్య , డిప్యూటీ కలెక్టర్ మురళీ , సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి రమణ మూర్తి , హౌసింగ్ పీడీ మురళీ, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, డిటిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

పిల్లలను చేర్పించేందుకు బడిబాట : డిఇఒ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. గురువారం బొబ్బిలిలోని బాలికల పాఠశాలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 40 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయని తెలిపారు. విద్యార్థులతో బాలల సంఘాలు ఏర్పాటు చేసి సంఘాల ద్వారా వారిలో మెరుగైన వైద్య , క్రమశిక్షణ ,అసాంఘిక కార్యకలాపాలకు దూరం చెయ్యడం వంటివి చేస్తామన్నారు. 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. పలు పాఠశాలలు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఆయనతో పాటు ఎంఇఒలు లక్షణరావు, వాసు పాల్గొన్నారు



నరవ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసిడిఎస్ పీడీ విమలారాణి, సూపర్‌వైజర్ అనురాధ

పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలి

ఐసిడిఎస్ పీడీ విమలారాణి

ప్రజాశక్తి-గంట్యాడ

పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు అర్థమయ్యే రీతిలో క్రమం తప్పకుండా బోధించాలని ఐసిడిఎస్ పీడీ విమలారాణి అన్నారు. గంట్యాడ మండలం నరవ అంగన్వాడీ కేంద్రాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని, వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి అంశాన్ని తెలియజేయాలని అన్నారు. కేంద్రంలో పిపి వన్, పిపి టు పుస్తకాలను, ఆహార పదార్థాల స్టాకును పరిశీలించారు మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కిచెన్ గార్డెన్ ను పరిశీలించి ఆకుకూరలు కూరగాయ మొక్కలను ఎక్కువగా పెంచాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. పర్యటనలో బుడతనాపల్లి సెక్టార్ సూపర్వైజర్ అనురాధ పాల్గొన్నారు.

టెన్త్ ఉత్తీర్ణులకు సీపెట్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్


భారత ప్రభుత్వ విద్యా సంస్థ 'సీపెట్ విజయవాడ' లో ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పదవ తరగతి సప్లిమెంటరీలో పాస్ అయిన విద్యార్థులకు 3ఏళ్ల వ్యవధి గల డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్. సిహెచ్. శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి, నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జులై 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కోర్సులను పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో గల బహుళ జాతి సంస్థ, అనుబంధ సంస్థలలో జూనియర్ ఇంజనీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ , మేకర్, జూనియర్ ఇంజినీర్ (మెయింటెనెన్స్) వంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు విధానం, ఇతర సహాయం కోసం 7893586494 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నీలయ్య వలసలో ఏనుగుల అలజడి

మొక్కజొన్న చేలు ధ్వంసం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మరువాడలో ఈనెల 25న ప్రవేశించిన గజరాజులు గురువారం నీలయ్య వలస పొలాలలోకి చేరుకొని అలజడి చేశాయి. గజరాజులు పొలాల్లో సంచరించి మొక్కజొన్నను ధ్వంసం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్న ఈ సమయంలో గజరాజులు సంచరించడంతో పొలాలకు కూడా రైతులు వెళ్లేందుకు అవకాశం లేక వెళితే దాడి చేస్తాయని భయపడుతున్నారు. గ్రామ సమీపంలోనే సంతరిస్తున్న గజరాజులు గుంపు గ్రామంలోకి సొరబడి దాడి చేస్తాయేమోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



మొక్కజొన్న చేనును ధ్వంసం చేస్తున్న ఏనుగులు

సచివాలయ ఉద్యోగుల నిరసన

రికార్డు అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులకు గెజిటెడ్ స్థాయి నిబంధనలా?

విలేజ్ సర్వేయర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ దుర్గా మదీనా



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. వీరి ఆందోళనకు సచివాలయ ఉద్యోగులు మద్దతు తెలిపారు. ధర్నానుద్దేశించి విలేజ్ సర్వేయర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ దుర్గా మదీనా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 5ను సవరించా లన్నారు. గ్రామ సచివాలయాల్లో 13 విభాగాలు ఉండగా ఒక్క సర్వే విభాగానికి మాత్రమే ప్రమోషన్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సర్వేయర్లకు టెక్నికల్ ఉద్యోగాలు ఇప్పించి నాన్ టెక్నికల్ పనులు అప్పగిస్తున్నారని విమర్శించారు. సర్వేయర్లను బదిలీలు ఎలా చేస్తారో ప్రభుత్వం తెలియపరచడం లేదన్నారు. రికార్డు అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులకు గెజిటెడ్ స్థాయి నిబంధనలు విధించడం అన్యాయమన్నారు. రాష్ట్ర కమిటీ విజయవాడలో చేస్తున్న సమ్మెకు మద్దతుగా విజయనగరంలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రమాదేవి, జిల్లా కమిటీ సభ్యులు వంశీ ,దేముడు బాబు, బి. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు వాయిదా వేయాలి : ఎపిజిఇఎ

విజయనగరం టౌన్ :గ్రామ, సచివాలయ ఉద్యోగులకు ముందుగా రేషనైలేజిషన్ చేసి, సర్వీస్ రూల్స్ రూపొందించి అనంతరం బదిలీలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం ఎపిజిఇఎ అధ్యక్ష కార్యదర్శులు కంది వెంకటరమణ, బాల భాస్కర్ ఒక ప్రకటనలో కోరారు. మిగుల సిబ్బందికి సంబంధించి స్పష్టమైన విధానాలు రూపొందించి, స్థానిక మండలాల్లో పనిచేసేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర సంఘం గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటుందని తెలిపారు.





ప్రేమ సమాజంలో వృద్ధులతో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే అదితి, ఎంపి కలిశెట్టి; అశోక్‌గజపతికి గొర్రెపిల్లను బహుమతిగా ఇస్తున్న నాయకులు

ఘనంగా అశోక్ గజపతి జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన ఎంపి, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు పి.అశోక్‌గజపతిరాజు పుట్టిన రోజు వేడుకలు గురువారం అశోక్‌బంగ్లాలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యేలు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలి రావడంతో అశోక్ బంగ్లా కిటకిటలాడింది. కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను అశోక్‌గజపతిరాజు కట్ చేసి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతక ముందు సింహాచలం దేవస్థానం, రామతీర్థం, పైడితల్లి అమ్మవారి ఆలయం ప్రధాన అర్చకులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అశోక్‌దంపతులను ఆశీర్వదించారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, నెల్లిమర్ల టిడిపి మండల అధ్యక్షుడు కడగల ఆనంద్, సువ్వాడ రవిశేఖర్, సువ్వాడవనజాక్షి. లెంక అప్పలనాయుడు, గేదెల రాజారావు, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, మాజీ ఎంఎల్‌సి ద్వారపురెడ్డి జగదీష్, ఎన్.టి.ఆర్.మెడికల్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ జెసినాయుడు, విజయనగరం పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారు బాబు,మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నరసింగ రావు, ప్రధాన కార్యదర్శి గంటా పొలినాయుడు, ఆఫీసు కార్యదర్శి రాజేష్ బాబు, విజయనగరం మార్కెట్ కమిటీ అధ్యక్షులు కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయకుమార్, అవనాపు విజయ్, జనసేన పార్టీ నాయకులు అవనాపు విక్రమ్ తదితరులు పుస్తకాలు, మొక్కలు ఇచ్చి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నెల్లిమర్ల టిడిపి నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. అశోక్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రేమ సమాజంలో వృద్ధులతో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కేక్ కట్ చేయించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం రాత్రి అశోక్ గజపతిరాజు దత్తత గ్రామమైన ద్వారపూడి గ్రామంలో అశోక్ గజపతిరాజు జన్మదినోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఆదర్శాలు ఎప్పుడూ ఆచరణీ యమైనప్పుడే వాటికి విలువ ఉంటుందని అన్నారు. అధికారం ఉన్నప్పుడు అహంకారంతో పోతే ప్రజా స్వామ్యంలో అటువంటి వారికి చోటు ఉండదని అన్నారు. ప్రజలతో కలిసి ఉండడమేకాకుండా అభివృద్ధికి బాటలు వేసుకోవాలని అన్నారు.

దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

దేవస్థానం భూముల్ని అన్ని విధాలా పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి దేవాదాయ భూముల పరిరక్షణ కమిటీ సమావేశంలో జెసి మాట్లాడుతూ 11 వేల ఎకరాల భూమి దేవాదాయ శాఖ పరిధి లో ఉందని, ఇందులో కొంత ఆక్రమిత భూమి ఉందని, ఈ భూమి వెంటనే సర్వే చేయించాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. మన్సాస్ ట్రస్ట్‌కు చెందిన భూమి లో కూడా ఆక్రమణలు ఉన్నాయని, ఇందులో వ్యవసాయ, నివాస, వాణిజ్య పరంగా ఆక్రమించి ఉన్నాయని, వివిధ సంస్థల ద్వారా ఆక్రమిత భూములకు సంబంధించి 50 లక్షల వరకు యూజర్ ఛార్జీ ల క్రింద ఆక్రమణ దారులు చెల్లించారని తెలిపారు. అయితే ఎటువంటి యూజర్ ఛార్జీలు చెల్లించకుండా కమర్షియల్‌గా వినియోగిస్తున్న వారి భూములలో సముదాయాలను తొలగించాలని, అందుకు రెవిన్యూ వారు పోలీసుల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. భూముల విషయం లో కోర్ట్ ఆర్డర్స్‌ను కూడా వెంటనే అమలు చేయాలని తెలిపారు. మ్యుటేషన్స్ చేయవలసిన వాటి వివరాలను మండలాల వారీగా ఆర్‌డిఒలకు అందజేయాలని, ఆర్‌డిఒలు వెంటనే మ్యుటేషన్ జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, దేవాదాయ శాఖ ఎసి శిరీష, ఆర్‌డిఒలు సవరమ్మ, రామ్మోహన్‌రావు, ఆశయ్య , సర్వేశాఖ ఎడి రమణ మూర్తి, డిపిఒ మల్లిఖార్జున రావు, డిఎస్‌పి వీర కుమార్, మన్సాస్ డిప్యూటీ కమిషనర్, పలు ఇఒలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

మెరుగైన సేవలు అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సామాజిక ఆసుపత్రిలో రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సూచించారు. గురువారం స్థానిక సిహెచ్‌సిలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం కమిటీ చైర్మన్ నాగ మాధవి ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా 24 గంటలు రోగులకు సేవలు అందించాలన్నారు. కమిటీ సభ్యులుగా కొత్తగా నియమితులైన మజ్జి రాంబాబు, దుర్గాసి శేఖర్‌లను ఉద్దేశించి సభ్యులు ఎప్పటికప్పుడు ఆసుపత్రిను సందర్శించాలని, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి వైద్యులతో మాట్లాడి తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆగస్టు నాటికి ఆసుపత్రి నూతన భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. 2019లో ఈ ఆసుపత్రి భవనానికి శ్రీకారం చుట్టిన గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదని అసహనం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అభివృద్ధి పనులకు ఇటీవల రెండు కోట్ల రూపాయలను మంజూరు చేయించినట్లు చెప్పారు. రూ. 49కోట్ల రూపాయలతో రక్షిత నీటి పథకాన్ని మంజూరు చేయించాను అన్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ గీతాభవాని వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, లోకం ప్రసాద్, డాక్టర్ గీత భవానితోపాటు కమిటీ సభ్యులు మజ్జి రాంబాబు, దుర్గాసి శేఖర్, నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారకనాథ్, జనసేన నాయకులు కరుమజ్జి గోవిందరావు, ఎంఎం నాయుడు, గంటా సతీష్, ఎడ్ల గోవిందరావు, రవ్వ నాని, అప్పికొండ రవికుమార్, వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధే లక్ష్యం

డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. గురువారం స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో మెప్మా ఆర్‌పిలకు టాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతమే సమాజ అభివృద్ధికి మూలస్థంభం అని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతీ ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తని తయారు చేయాలని చూస్తుందని, దానికి అనుకూలంగా మన ఆలోచన విధానం మారాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెప్మా పథకాలు, ఆర్థిక సహాయం, శిక్షణలద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు మహిళలు అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, జనసేన నాయకులు పతివాడ అచ్చం నాయుడు, ఎంఎం నాయుడు, మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

ప్రజాశక్తి - గజపతినగరం

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 విత్తన నమూనాల లక్ష్యంలో ఏడు దుకాణాల నుండి 20 విత్తన నమూనాలను సేకరించి తాడేపల్లిగూడెం విత్తన పరీక్ష కేంద్రానికి పరీక్ష కోసం పంపించినట్లు తెలిపారు. ఈ పరీక్షలలో విత్తనాలు మొలక శాతం, తేమ శాతం,భౌతిక నాణ్యత పరీక్షిస్తారని తెలిపారు. దుకాణదారులు ప్రభుత్వం అనుమతించిన విత్తనాలనే విక్రయించాలని అన్నారు.

ప్రగతి కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని ప్రగతి డిగ్రీ, పీజీ కళాశాలలో పట్టభద్రులకు దివిస్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ గురువారం ఇంటర్వ్యూ నిర్వహించింది. ఇంటర్వ్యూలలో బిసిఎస్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బిటెక్ మెకానికల్, డిప్లొమా కెమికల్ అర్హత కలిగిన వారు 87మంది హాజరు కాగా అందులో 34 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ వనుము శ్రీనివాస రావు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్స్‌లో ధ్రువపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కంప్యూటర్ శిక్షణ ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని, నేడు సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు శిక్షణ పొందాలని డిప్స్ కంప్యూటర్స్ అధినేత కె. ఎస్.బి.కె.రాజు(డిప్స్ రాజు) అన్నారు. గురువారం డిప్స్ కంప్యూటర్స్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పూర్తి చేసిన 25 మంది విద్యార్థులకు ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా కంప్యూటర్ రంగంలో అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నామని, ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడినట్లు తెలిపారు. ఆగస్టులో 33 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న శుభ సందర్భంగా విద్యార్థులకు 32 శాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ భాగ్య లక్ష్మి పాల్గొన్నారు.

పలు ప్రాంతాలకు నేడు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక కొత్తపేట నీళ్ల ట్యాంకు ద్వారా వస్తున్న పైపులైను రాజారావు మేడ సమీపంలో లీకేజీకి గురి కావడంతో శుక్రవారం కొన్ని ప్రాంతాలలో నీటి పంపిణీ నిలుపుదల చేస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇప్పటికే లీకేజీలను సరి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నామని చెప్పారు. అయితే మంచినీరు జాగ్రత్తగా నీరు కలుషితం కాకుండా ఉండేందుకు పల్లి వీధి, కోలగట్ల వారి వీధి, కమ్మ వీధి, చిక్కాల వీధి, కోతికి వీధి, తెలకల వీధి మొదలైన ప్రాంతాలలో నీటి పంపిణీ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటి పంపిణీ జరుగుతుందని చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండల కేంద్రంలోని తాగునీటి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని యాతవీధికి చెందిన ప్రజలు శుక్రవారం పంచాయతీ అధికారికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూసపాటిరేగ పంచాయతీలోని యాత వీధిలో సుమారు 150 ఇళ్లు ఉన్నాయని, వీటికి ఆనుకుని వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ, వీధి ఎత్తులో ఉండటంతో తాగునీరు అందే పరిస్థితి లేదన్నారు. మిగతా గ్రామస్తుల మాదిరి తమకు కూడా తాగునీరు అందించాలని కోరుతూ ఇఒపిఆర్‌డికి వినతి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ చట్టసవరణ బిల్లుతో నష్టం

ప్రజాశక్తి-బొబ్బిలి

పెన్షన్ చట్టసవరణ బిల్లుతో పెన్షనర్లకు నష్టం జరుగుతుందని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి అన్నారు. పెన్షన్ చట్టసవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పెన్షనర్లకు నష్టం చేసేందుకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం పెన్షన్ చట్టసవరణ బిల్లు తెచ్చిందని విమర్శించారు. చట్టసవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.జగన్నాథం, పి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే బేబినాయనకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా కార్యదర్శి తెంటు రవి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వచ్చేనెల 9న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో తామంతా విధులు బహిష్కరించి పాల్గొంటామని ఎమ్మెల్యేకు తెలిపారు.

శ్మశానంలో యువత శ్రమదానం

ప్రజాశకి-నెల్లిమర్ల

జరజాపుపేట శ్మశానంలో గ్రామస్థులు శ్రమదానం నిర్వహించారు. గురువారం విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువ ఇంజనీర్ గణేష్‌కు శ్రమదానం చేసి ఘనంగా నివాళులార్పించారు. గురువారం ఉదయానికి నెల్లిమర్ల చేరుకున్న గణేష్ మృతదేహాన్ని వందలాదిమంది యువకులు, గ్రామస్తులు బైక్ ర్యాలీతో నెల్లిమర్ల నుంచి జరజాపుపేట శ్మశానానికి తీసుకువచ్చారు. కుటుంబీకులు, గ్రామ పెద్దలు, బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు బోరున విలపిస్తూ గణేష్‌ను కడసారి చూశారు. అనంతరం గణేష్ మృతికి ఘనంగా నివాళులర్పిస్తూ సంతాప సూచికంగా సిపిఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు సూచన మేరకు స్మశాన ఆవరణలో గ్రామస్తులందరూ శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో మృతుని తండ్రి మద్దిల సత్యనారాయణ, కుటుంబీకులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, బంధువులు స్నేహితులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి ఆర్‌టిఐ వింగ్ కార్యదర్శిగా మధుసూదనరావు

ప్రజాశక్తి -గుర్ల

వైసిపి ఆర్‌టిఐ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా కెంగువ మధుసూదన రావును నియమించింది. ఈయన గతంలో కొండగండ్రేడు గ్రామ ఎంపిటిసి సభ్యులుగా, వ్యవసాయ సలహా మండలి సభ్యులుగా, జెసిఎస్ మండల ఇన్చార్జిగా పనిచేశారు. తనను కార్యదర్శిగా నియమించడం పట్ల శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, శీర అప్పలనాయుడు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, మండల పార్టీ అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు తోట తిరుపతిరావు, అంబల్ల లక్ష్మి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు జమ్ము స్వామి నాయుడు, బెల్లాన బంగారు నాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విఒఎలతో సమావేశం

ప్రజాశక్తి - సంతకవిటి

స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎ. చిరంజీవి ఆధ్వర్యంలో విఒఎలతో సమావేశం జరిగింది. స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వై.చిట్టి బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపియం చిరంజీవి మాట్లాడుతూ గ్రామ, మండల సమాఖ్యల్లో నెల వారీగా సమావేశాలు నిర్వహణ; ఆర్థిక లావాదేవీలు నిర్వహణ, బుక్స్ అఫ్ అకౌంట్స్ పక్కాగా నిర్వహించి సంస్థలు బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎపిఎం టి.దదికుమార్, స్త్రీ నిధి మేనేజర్ వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

శృంగవరపుకోట : మండలంలోని వేములపల్లిలో తెగిపడిన ఒక విద్యుత్ తీగ నిండు ప్రాణాన్ని బలిగొంది. లగుడు ప్రదీప్ (26) తన తల్లితో గడ్డి కోయడానికి వెళ్ళాడు. గడ్డి మోపు పట్టుకొని వస్తున్న సమయంలో తెగిపడిన విద్యుత్ తీగ ఈ గడ్డిమోపును తాకింది. వెంటనే విద్యుత్ షాక్‌తో ప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రదీప్‌కు నెలరోజులక్రితమే పెళ్లయ్యింది. ఇంతలోనే ఘోరం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కట్టుకున్న భార్య విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరి గుండెలను పిండేసింది.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నివారణాదినోత్సవంలో వక్తల పిలుపు ● భారీ ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా నివారణా దినోత్సవం సందర్భంగా డ్రగ్స్ కు వ్యతిరేకంగా గురువారం వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో జిల్లా పోలీసు శాఖ భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా స్థానిక లీ ప్యారడైజ్ కల్యాణ మండపంలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడినుంచి కోట జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫ్లాష్‌మాబ్ ద్వారా డ్రగ్స్‌వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు.

అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతీఒక్కరూ తమ సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. ప్రతీ ఒక్కరికీ చదువుతోపాటు భద్రత చాలా అవసరమని, చుట్టూ ఉన్న సమాజాన్ని గమనించాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విలువలతో కూడిన తరం రూపొందాలని కోరారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత ఆశయాలతో సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. విశాఖ రేంజ్ పరిధిలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలకు తీసుకున్న చర్యలను వివరించారు.

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిర్మూలన ఒక సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మత్తుపదార్థాల జోలికి పోకుండా ప్రతీఒక్కరూ నిగ్రహంగా ఉండాలని, వ్యక్తిగత విలువలు పాటించాలని కోరారు. జిల్లాలో మత్తుపదార్థాలను నిర్మూలించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లు వ్యక్తిగత, కుటుంబ పరువు ప్రతిష్టతలను, ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయని అన్నారు. యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతులుగా, ఆదర్శనీయంగా ఎదగాలని కోరారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసైతే బయటపడటం కష్టమని, అందువల్ల సరదాకైనా వీటి జోలికి వెళ్లొద్దని సూచించారు. డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడేందుకు జిల్లాలో రెండు డి-అడిక్షన్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో మార్కెఫెడ్ రాష్ట్ర ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, ఎం.శ్రీనివాసరావు, పి.స్వప్నహైందవి, డాక్టర్ వెంకటేశ్వర్రావు మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమవంతుగా కృషి చేస్తామని అందరితోనూ ఎఎస్‌పి సౌమ్యలత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గాంధీ మాష్టారు, పల్సర్ బైక్ రమణ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పాటలు పాడి యువతకు ఉత్తేజాన్ని కల్గించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసు శాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖలు రూపొందించిన ప్రచార గోడ పత్రికలను ఈ సందర్భంగా అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎన్‌సిసి కేడెట్లు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాధుడు ఆధ్వర్యంలో, ర్యాలీ నిర్వహించారు. రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం నుండి ప్రారంభమై లయన్స్ క్లబ్ మరియు ఫోర్ట్ జంక్షన్ మీదుగా గుంచి వరకు కొనసాగింది. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్లు

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

విజయనగరం లీగల్ : జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద ప్రధాన న్యాయమూర్తి ఎం.భబిత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల జోలికి పోవద్దని, మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని సూచించారు మాదకద్రవ్యాలు వాడినా, అమ్మినా, రవాణా చేసినా అట్టి వారిపై చాలా కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలిశెట్టి రవికుమార్, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

డెంకాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలు-యువతపై వాటి దుష్ప్రభావం అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ హాజరై మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు మత్తు పదార్థాలను సేవించిన వాటిని అమ్మిన రవాణా చేసిన కఠిన శిక్షలో ఉంటాయని తెలిపారు మాదకద్రవ్యాల దుర్వినియోగం యువతపై వాటి దుష్ప్రభావానికి సంబంధించి వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం కాలేజీ ఆవరణలో మానవహారం నిర్వహించి డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హిమ గాయత్రి ,రూరల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయలక్ష్మి, రూరల్ ఎస్సై శ్రావణ్ కుమార్, విముక్తి స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ విజయనిర్మల పాల్గొన్నారు.

గజపతినగరంలో..

స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె. విజయ రాజ్ కుమార్ మాట్లాడుతూ , మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యపై దృష్టి కేంద్రీకరించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు పి.శాంతి, నరేంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బొండపల్లి : యువత మాదకద్రవ్యాల మత్తులో చిత్తు కావొద్దని గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.వి.రమణ అన్నారు. ఎస్ఐ యు. మహేష్ ఆధ్వర్యంలో సాయి సిద్ధార్ధ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిదిగా పాల్గొన్న సిఐ మాట్లాడారు. ఐసిడియస్ సూపర్ వైజర్ జి.గౌరి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాము, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గజపతినగరం : సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ విజయ్‌కుమార్‌రాజ్

బాడంగి : డ్రగ్స్ నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని ఎస్ఐ తారకేశ్వరావు అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులు, యువత భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యాసంస్థల ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస మున్సబ్ మెజిస్ట్రేట్ కోర్టు మెజిస్ట్రేట్ డాక్టర్ సముద్రాల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో కోర్టు దగ్గర నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కొత్తవలస బార్ అసోసియేషన్ అధ్యక్షులు డివిఎల్. దేవి, జి మహేంద్ర, కె.మహేశ్వరరావు, ఎన్. శ్రీరామ్మూర్తి, జి.పి.లత, డి. శ్రీనివాస్ ఇతర న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని వీరనారాయణ హై స్కూల్ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : డ్రగ్స్ రహిత సమాజానికి అన్ని వర్గాలు సహకరించాలని ఎస్ఐ బి. గణేష్ కోరారు. మిమ్స్ కళాశాల వద్ద విద్యార్థులతో ర్యాలీ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సికెఎం కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ త్రినాధ మాట్లాడారు. ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు, చైల్డ్ లైన్ సంస్థ ప్రతినిధి అనిల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం : ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన స్థానిక ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్‌సిఐ జై భీమ్ మాట్లాడారు. ప్రభుత్వ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ భాస్కర్రావు, , వైస్ ప్రిన్సిపాల్ లక్మణరావు,అధ్యాపకులు, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్, జి.మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్కవరపుకోట : మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శ్రావణి కళ్యాణమండపంలో ఎస్ఐ సిహెచ్ నవీన్ పడాల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ బి.అనిల్ కుమార్, డిప్యూటీ తహాశీల్దార్ టి. రమేష్, మాజీ ఎంపిపి కొల్లి వెంకటరమణ మూర్తి, టిఎఎస్ ఐ టి శ్రీనివాసరావు,



విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

హెచ్ సి వైకుంఠం, సిబ్బంది సచివాలయం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కార్యకర్తలు ఆటో యూనియన్ డ్రైవర్లు, ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మత్తుతో చిత్తుకావొద్దు: ఎమ్మెల్యే కోండ్రు

రాజాం : బొబ్బిలి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరక ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి యువత మత్తుతో చిత్తుకావొద్దు అని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మీడియాతో మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు.

రేగిడి : మండలంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎస్సై నీలావతి పాల్గొన్నారు. బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, అధికారులు ఎంఇఒ ఎం వరప్రసాదరావు, బాసిన గోవిందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. న్యాయ సేవా సంఘం అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

చీపురుపల్లి : మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు యువతకి పిలుపునిచ్చారు. చీపురుపల్లి లో జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐ శంకరరావు, ఎస్ ఐ దామోదరరవు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చీపురుపల్లిలో మానవహారం చేస్తున్న విద్యార్థులు

వంగర : స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు అధికారులు ఉద్యోగులు విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ రఘునాథ చారి, ఎస్ ఐ షేక్ శంకర్ ఆర్ ఐ బోనెల రామారావు ప్రవీణ్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి : మాదకద్రవ్యాలు వలన కలిగే అనర్థాలపై ర్యాలీ చేసి కళాభారతి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐ రాముడు, వివిధ శాఖాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎస్ఐ సుదర్శన్ , సిబ్బంది, విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం : వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి పోలీసు స్టేషన్ నుంచి 3 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ ప్రసాదరావు, డిటి గిరిధర్, అంగన్వాడీ సూపర్వైజర్ కష్ణ కుమారి,ఆశాలు,అంగన్వాడీలు,ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : మండల కేంద్రంలో ఎస్ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు బొబ్బిలి సిఐ నారాయణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపిడిఒ ఆర్ రాంబాబు, ఎంఇఒ త్రినాధ రావు, ఎఎంసి చైర్మన్ వెంకట్ నాయుడు వెంకటేశ్వర కాలేజ్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతకవిటి : మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కె. సురేశ్ కుమార్, రూరల్ సిఐ హెచ్.ఉపేంద్ర రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మత్తుకు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాలరావు, ఎంఇఒ శాంతికుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజాంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళి

నట్టల నివారణకు ఉచిత వ్యాక్సిన్

ప్రజాశక్తి -చీపురుపల్లి

గొర్రెలు, మేకలలో వచ్చే నట్టల వ్యాధిని నివారించేందుకు ఉచితంగా వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు చీపురుపల్లి పశుసంవర్ధక శాఖ ఎడి సిహెచ్ బాలసుబ్రమణ్యం తెలిపారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేటలో గొర్రెలకు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, చీపురుపల్లి టిడిపి పట్టణ అధ్యక్షుడు గవిడి నాగరాజు తో కలిసి నత్తల నివారణ మందులను ఏడి వేశారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ మండలంలో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి, చిటిక వ్యాధి, పిపిఆర్ వ్యాధులు రాకుండా డి వార్మింగ్, వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. మండలంలో సుమారు 150 మంది రైతులకు సంబంధించి 21 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని, ఈనెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకు జరిగే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గద్దె అనురాజ్ చౌదరి, అంబల్ల చిన్నతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో గొర్రెలు మేకల నట్టల నివారణ మందు పంపిణీ ఈనెల 26 నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందనిపశు వైద్యశాఖ ఎడి డాక్టర్ బి.చలపతిరావు తెలిపారు. గురువారం డిఆర్ పేట, ఆర్ ఎస్ పేట, పాటూరు, బొద్దాం గ్రామాల్లో సుమారుగా 2వేల గొర్రెలు, మేకలకు నట్టలు నివారణ వ్యాక్సిన్ వేశాఉ. మండలంలో 15వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని, పెంపకందార్లంతా అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేపాడ పశువైద్యాధికారి డాక్టర్ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మండలంలోని రోడ్లు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ అంబేద్కర్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్‌ను కలిసి అత్యవసర నిధులు మంజూరు చేయాలని కోరారు. గొర్లెసీతారాంపురం, జ్యూట్ మిల్లు, పాతబొబ్బిలి వద్ద పాడైపోయిన రోడ్డును బాగు చేసేందుకు అత్యవసర నిధులు రూ.15లక్షలు మంజూరు చేయాలని కోరారు. పారాది వద్ద బిసి వసతి గృహం మంజూరు చేయాలన్నారు. నిధులు మంజూరుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయనతో బుడా చైర్మన్ తెంటు రాజా ఉన్నారు.

కంపెనీలు వద్దంటే ఉపేక్షించం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ భూముల్లో కంపెనీలు వద్దంటే ఉపేక్షించేది లేదని డిసిఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ అన్నారు. కర్మాగారానికి భూములు ఇచ్చి ఎవరైనా పరిహారం పొందనట్లయితే తనకు తెలియజేస్తే 15 రోజుల్లోగా పరిహారాన్ని ఇప్పిస్తామని తెలిపారు. మండలంలోని బొడ్డవర విజయనగరం జాతీయ రహదారికి ఆనుకొని జిందాల్ కార్యాలయం వద్ద ఎంఎస్‌ఎంఇ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్వహిస్తున్న ధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కంపెనీలు వస్తే యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. జిందాల్ భూముల విషయంలో ఎవరికైనా ఎటువంటి సందేహాలున్న తనకు గాని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి గాని తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో రాయవరపు చంద్రశేఖర్, మంగరాజు, రామ సత్యం, గనివాడ సన్యాసినాయుడు, ఉమామహేశ్వరరావు, జిందాల్ భూములిచ్చిన రైతులు యువత తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలలో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి- వంగర

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం కొన్ని నెలల కిందట ఈ నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు కేటాయించడంలో తాత్సారం చేస్తోందన్నారు. నిధులు విడుదల కాకపోవడంతో గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టేందుకు ఇబ్బందిగా ఉందని, గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు సకాలంలో చెల్లించలేక పోతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీలకు మండల పరిషత్తులకు 15 ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

9న సమ్మెలో మేముసైతం

విద్యాశాఖ ఎడికి ఎండిఎం కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జూలై 9న జరిగే జాతీయ సమ్మె లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు విధులు బహిష్కరించి పాల్గొంటున్నామని గురువారం విద్యాశాఖ ఎడికి ఎపి మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనకార్మికులను కార్మికులుగా గుర్తించి కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దుచెయ్యాలని, మెనూ ఛార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. నోటీసు ఇచ్చిన వారిలో లక్ష్మి, ఉమా, రాములమ్మ పాల్గొన్నారు.

రాజాం : దేశ వ్యాప్తంగా సమ్మెలో అంగనావాడీలు కూడా పాల్గొంటారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ జూనియర్ అసిస్టెంట్ చందుకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కార్మిక కోడ్‌ల రద్దు, అంగన్వాడీ సమస్యల పరిష్కారానికై జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు.

నెల్లిమర్ల : స్థానిక సమస్యలు పరిష్కరించకపోతే వచ్చేనెల 9న సార్వత్రిక పాల్గొంటామని నగర పంచాయతీ కమిషనర్‌కు కార్మికులు నోటీసు అందజేశారు. 2024 డిసెంబర్ 26 నుంచి జనవరి 10 వరకు 17 రోజులు పాటు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ నాన్ పిహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం 21వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొంటున్నామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, యూనియన్ జిల్లా నాయకులు ఎ.జగన్ మోహన్‌రావు తెలిపారు. నోటీసు అందించిన వారిలో యూనియన్ ప్రతినిధులు బాబురావు, హరిబాబు, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ సిడిపిఒకు సమ్మె నోటీసు

సార్వత్రిక సమ్మెలో విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొంటున్నామని సిడిపిఒ సత్యవతికి యూనియన్ నాయకులు కె.ప్రభావతి సమ్మె నోటీసు అందజేశారు. కె.వరలక్ష్మి, కె.రామలక్ష్మి, ఎస్.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు.క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్‌అండ్ బి జంక్షన్ వద్దనున్న రైతు బజార్ ప్రాంతాన్ని పరిశీలించారు. కూరగాయల వ్యాపారులు ముచ్చు కవర్లు ప్లాస్టిక్ వాడకాన్ని చేస్తున్నారా లేదా అన్నది గమనించారు. రైతు బజారు వెలుపలు ఉన్న వ్యాపారస్తులందరూ విచ్చలవిడిగా ముచ్చు కవర్లను వినియోగించడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వద్దనున్న ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకుని అపరాధ రుసుము విధించారు. ఆ తర్వాత 47 వ నెంబర్ సచివాలయాన్ని తనిఖీ చేశారు.

అసిస్టెంట్ కమిషనర్‌పర్యటన

నగరంలోని 40వ డివిజన్ ఎల్.బి. కాలనీలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, స్థానిక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. రహదారిని ఆక్రమించి కొన్ని చోట్ల భవన వ్యర్థాలు, ఇసుక వంటివి ఉండడాన్ని గమనించి సంబంధిత వ్యక్తులను మందలించారు. తక్షణమే వాటిని తొలగించి వేయాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలను, పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల తరగతి గదిని త్వరలోనే తొలగిస్తామని చెప్పారు. ఆయన వెంట ఎఇ సీతారామమూర్తి, టిపిఒ అప్పలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంలో సదస్సు

విజయనగరంటౌన్ : సీతం ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం 'మానసిక ఆరోగ్యం- వ్యక్తిత్వ వికాసం-కెరీర్ అభివృద్ధి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పద్మాక్షి లోకేష్ ప్రసంగించారు. ప్రస్తుత యువత తీవ్ర ఒత్తిడి, ఒంటరితనంతో పాటు మానసిక అలసటకు లోనవుతుండడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. లక్ష్యంపై దృష్టి పెట్టడం, జీవితాన్ని సమర్థవంతంగా నడిపించేందుకు సానుకూల దృక్పథం కలిగి ఉండడం ఎంతో అవసరమని చెప్పారు. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు వాడకంతో వచ్చే ఆరోగ్య సమస్యలపై హెచ్చరించారు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

పిజి సెట్‌లో గౌరీశ్వరికి ఫస్ట్ ర్యాంకు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని పెంట గ్రామానికి చెందిన చింతల గౌరీశ్వరి ఎపి పిజిసెట్ తెలుగు విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. రాజాంలో తెలుగు పండిట్ పూర్తి చేసిన గౌరీశ్వరి తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన సెట్‌లో 88 మార్కులు సాధించి రాష్ట్ర మొదటి ర్యాంకు సాదించడంతో తల్లిదండ్రులు అనసూర్య, సత్యం, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎపి పిజి సెట్‌లో షిరిడి సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. వెంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన పిజి సెట్‌లో కెమికల్ సైన్స్‌లో వై.లిఖిత 96 , ఎన్.జ్యోతి 96, ఇంగ్లీషులో వై.బిజిలి 245, కంప్యూటర్ సైన్స్ లో సిహెచ్ లిఖిత 337, ఎస్.కీర్తి 855, ఎ.పావని 990, కె.హిమబిందు 1108వ ర్యాంకులు సాదించి సత్తా చాటారు. ఐసెట్‌లో డి.తారకరామ 693, జి.నందిని 850వ ర్యాంకు సాధించారు. వీరందరినీ కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, అధ్యాపకులు అభినందించారు.